# మధుర భావన-14

అయితే ఆవిడ మాటలు విని...ఆనంద శిఖరం చేరి ఉల్లాసంగా నర్తిస్తున్న అతని మనసు పాతాళానికి జారిపోయింది ! " బాబూ...మీ అమ్మ తప్పిపోయిందా...చిన్నప్పటి జ్ఞాపకాలతో ఆమె కోసం ఇంతగా తల్లడిల్లుతున్నావంటే...మీ అమ్మ చాలా అదృష్టవంతురాలు ! అమ్మ అనురాగమే తరగని ఆస్తి అని తలిచే నీలాంటి పిల్లలున్న తల్లి ఎంత పుణ్యం చేసుకుందో ! తప్పకుండా నువ్వు ఆమెను కలుసుకోగలగాలని కోరుకుంటున్నాను " అంటూ తలపై చేయి వేసేసరికి వంశీ నిరుత్తరుడైపోయాడు.

ఏం మాట్లడలేనివాడిలా తల్లి వైపు రెండు క్షణాలు చూసి అక్కడనుండి లేచి వచ్చేసాడు.

ఇంటికి వచ్చిన వంశీ వైఖరి చూసి తిలోత్తమ గట్టిగా నిట్టూర్చింది.

" బావా...ఏమిటిది ..? ఓ సరదా, సంతోషం లేకుండా ఇలా గడపాల్సిందేనా...? నేనో మాట చెప్పనా..?" అనడిగింది.

ఏమిటన్నట్లుగా చూశాడు వంశీ.

''నువ్వు చక్కగా పెళ్ళి చేసుకుని, అత్తయ్యను ఇంటికి తీసుకువచ్చేస్తే బావుంటుందేమో కదా! అపుడు అత్త ఆరోగ్యం బాగుపడుతుందేమో! అలా కాకుండా ఎంత కాలమో తెలియకుండా 'అత్తయ్య ఆరోగ్యం బాగుపడ్డాకనే పెళ్ళి' అంటూ వాయిదావేయటం సరికాదేమో!'' అంది తిలోత్తమ.

''మీ వదిన చెప్పినదాన్నే నువ్వూ చెబుతున్నావ్! అంతేగా! కొత్తగా ఏమీ లేదుగా...?'' ఆ ప్రశ్నకు తిలోత్తమ కొంచెం తడబడుతూ ఆశ్చర్యంగా చూసింది.

''కొత్తగా... అంటే... ఇంకేం ఉంటుందీ...? కొడుకూ, కోడలూ కళ్ళముందు సరదాగా తిరుగుతుంటే, అత్తయ్య ఆరోగ్యం బాగుపడే అవకాశం ఉంటుంది కదా అని నాకూ అనిపించింది !'' అంది తిలోత్తమ నిట్టూరుస్తూ.

వంశీ కూడా నిట్టూర్చాడు. ''అమ్మ ఆరోగ్యం బాగుపడి నన్ను గుర్తుపట్టి... మామూలుగా మాట్లాడుతున్నపుడే... పెళ్ళి ఆలోచన! ఇందులో మార్పేం ఉండదు!'' వంశీ ఖచ్చితమన్నట్లుగా చెప్పిన ఆ

మాటలకు ''అయితే సరేలే బావా, ఇక నేనిక్కడ ఉండీ చేసేదేముందీ... నేనూ మా వూరుకు వెళ్ళిపోతాను!'' నిర్లిప్తంగా అంది తిలోత్తమ.

* * *

ఆ రాత్రి సుమజ వంశీకి ఫోను చేసింది.

''ఆనంద శిఖరాలకు చేరి... అంతలోనే అగాధంలోకి జారి... ఇపుడెలా ఉన్నారూ...?'' సుమజ నాటకీయంగా అడిగేసరికి వంశీ ఆశ్చర్యపోతూ ''దేని గురించి మాట్లాడుతున్నావ్ సుమా?'' అనడిగాడు.

''మీ అమ్మగారితో మీ చిన్నప్పటి జ్ఞాపకాలను పంచుకుంటూ... మిమ్మల్ని గుర్తుపట్టేశారన్నట్లు ఆనందించి... అంతలోనే మీరెవరో అన్నట్లుగా ప్రశ్నలు వచ్చేసరికి కృంగిపోవటం జరిగింది! అవునా? నిజమేగా...?''

''నిజమేగానీ, నేనొక్కడినేగా అక్కడ ఉన్నానూ... ఈ మాటలు నేనెవ్వరికీ చెప్పకుండా నీకెలా తెలిసాయీ...?'' సుమజ చిన్నగా నవ్వింది.

''ఆ గదిలో డాక్టరుగారు సి.సి. కెమెరా పెట్టించారట! అంటే... మీ అమ్మగారి గురించి అన్ని విషయాలూ తెలుసుకునేందుకు, ఆమెని పరిశీలించటం ముఖ్యమని, ఆ కెమెరా పెట్టించారని అన్నారు. ఈ రోజు మీ సంబాషణతో ఆయన కూడా ముందు మీ అమ్మగారిలో స్పందన కనిపించిందనీ అనుకున్నారట ! తర్వాత ఆవిడ మాటలు విని తనూ బాధ పడ్డానని నేను ఫోన్ చేసినపుడు చెప్పారు.అందుకే మీరెలా వున్నారోనని చేశాను !''

''అర్థమైందిలే ఇపుడు... ఆ జ్ఞాపకాలతో అమ్మలో ఏమైనా మార్పు వస్తుందేమోననే ఆశ ఉండేది. ఆ ప్రయత్నమూ ఫలించలేదు...!'' వంశీ నిట్టూర్చాడు.

"మీ చెల్లెలు విశేషాలేంటీ ? అనూష మళ్ళీ వచ్చిందా ?" అడిగింది సుమజ.

చెల్లెలు గుర్తుకు రాగానే వంశీ మొహం మ్లానమైంది.

"ఏమిటో సుమా....అనూష గుర్తు రాని రోజు వుండదు. అమ్మ ఆరోగ్యం బాగోలేనప్పుడు తన ప్రవర్తన బట్టి, తను ఆ విషయం ఇంకా జీర్ణించుకోలేక పోతుందని నాకు అనిపించింది. అమ్మ తో ఈ రోజు ఎన్నో విషయాలు...కబుర్లు పంచుకోవాలనుకున్నాను. చిన్నప్పటినుంచి అనూషతో నా అనుబంధం...

జ్ఞాపకాలు... అన్నీ నెమరేసుకోవాలని అనిపించింది. కానీ అమ్మ అన్న మాటలకు నాకు ఎలా రియాక్ట్ కావాలో కూడా అర్ధం కాక, అక్కడ వుండలేక వచ్చేసాను." బాధగా ధ్వనించింది అతని స్వరం.

"నాకు చెప్పండి మీ చిన్నప్పటి సంగతులు ?" ఆసక్తిగా అడిగింది సుమజ.

చిన్నప్పటి జ్ఞాపకాలతో వంశీ ముఖం దీప్తివంతమైంది.

“ నాకూ అనూషకి వయసురీత్యా ఎక్కువ వ్యత్యాసం ఉండటం వలన నేను తనని చాలా గారాబంగా చూసేవాడిని. అనూష కూడా ప్రతీ చిన్న విషయానికీ నా మీద ఆధారపడటమే కాదు..నన్ను ఒక సూపర్ హీరో లా చూసేది. తనకీ నాకూ అంత మంచి అనుబంధం ఏర్పడటంలో అమ్మదే ప్రధాన పాత్ర. అనూష ఏది అడిగినా అన్నయ్యని అడగమని తనే ప్రోత్సహించేది. రానూ రానూ అనూషకి అమ్మా నాన్నలకన్నా నేనే ప్రాముఖ్యమయ్యాను. స్కూల్ లో కూడా అందరితో నా కబుర్లేనట. ఎవరేమన్నా...'మా అన్నయ్యతో చెపుతా' అనే బెదిరించేదట. అలా స్కూల్ రోజులనుంచీ అందరూ తనకి 'అన్న కూచి అనూష' అని పేరు పెట్టారు. కానీ అందరూ తనని అలా పిలవటం వలన అనూష గర్వపడేదేకానీ ఎప్పుడూ చిన్నబుచ్చుకోలేదు. తన దృష్టిలో నా స్థానం పడిపోకూడదని నేను కూడా చాలా బాధ్యతగా మరింత ప్రేమగా వుండేవాడిని కూడా. తమాషా ఏమిటంటే అందరితో అలవాటైపోయి, ఒక్కోసారి అమ్మని కూడా...'అన్నయ్యతో చెబుతా' అని బెదిరించేది. అమ్మ ఎంత మురిసిపోయేదో చెప్పలేను.

ఎప్పుడూ స్కూలో ఎవరు ఏం పంచిపెట్టినా....చుట్టాలింట్లో ఏమిచ్చినా అనూష అక్కడ తినేది కాదు. తిన్నగా ఇంటికి వచ్చి నాకిచ్చేది. మా ఇద్దరికీ నేను పంచి ఇచ్చాకే తను తినేది. అమ్మ మురిపంగానే...' నువ్వే రెండు చాక్లెట్స్ తిని వాడికి రెండు ఇవ్వచుగా' అంటే...అనూష వెంటనే ' అమ్మా....అన్నయ్య కి నాలుగు నువ్విచ్చినా, నేనిచ్చినా...ఎలా పంచుతాడో నీకు తెలుసుగా...తను ఒకటే తీసుకుని నాకే మూడు ఇస్తాడు' అని పకపకా నవ్వేది.

నాకింకా బాగా గుర్తు వుంది...తను టెంత్ క్లాస్ లో వున్నప్పుడు...'ఎవరు గొప్ప వ్యక్తులు ' అన్న టాపిక్ మీద స్టేజి మీద పిల్లలను మాట్లాడమన్నారు. చాలామంది పిల్లలు ‘అంబానీ గురించి...అమితాబ్ గురించీ...సచిన్ గురించీ'..మాట్లాడారు. మా అనూష లేచి నిలబడి స్టేజి దగ్గరకు నడుస్తుండగా చాలామంది పిల్లలు...గోలగోలగా పాడటం మొదలుపెట్టారు..

' అన్నయ్య సన్నిధీ...అదే మాకు పెన్నిధీ ' అని ఒకడూ, మరొకడు...' చెల్లిగా నువ్వు పుట్టాకే అన్నగా నేను పుట్టానూ..' అంటూండగా, 'అన్నయ్య అన్న పిలుపూ...మా స్కూల్లో అందరికీ మేలుకొలుపూ...' అంటూ ఇంకొకడు పేరడీ అందుకున్నాడు. అలా అందరూ సరదాగా రకరకాలు పాడుతూండగా స్టేజి మీదకు వెళ్ళిన అనూష చెప్పిన మాటలు నాకింకా పొల్లుపోకుండా గుర్తు వున్నాయి....

' నా వరకూ ఎంత ఆస్తి సంపాదించినా...ఎంత పేరు ప్రఖ్యాతలు సంపాదించినా... రాని నమ్మకం, ధైర్యం మన కుటుంబాన్ని చూడగానే మనకు వస్తుంది. కుటుంబంలో కూడా మనకు జీవితాంతం తోడూ నీడగా...కొండంత అండగా నిలబడేది ఒక్క తోడబుట్టినవాళ్ళు మాత్రమే అని నేను నమ్ముతాను...అమ్మా-నాన్నలు కొంత వయసు వరకే తోడు వుండగలరు...కొంత వయసు వచ్చాకే భార్య లేదా భర్త తోడు వుంటారు...కానీ మన రక్తం పంచుకు పుట్టిన తోబుట్టువులే మనకి పుట్టుక నుంచి, కడదాకా అండగా నిలబడేది ...అందుకే అసలైన ఆస్తి నా దృష్టిలో మన తోడబుట్టినవాళ్ళే ..నిస్వార్థంగా నా విజయాలకు పొంగిపోతూ..కష్టాల్లో తోడు వుంటూ..నా కలలు సాకారం చెయ్యటమే తన జీవిత లక్ష్యంగా అనుకునే మా అన్నలాంటి తోబుట్టువు వున్నవాళ్ళే ఈ ప్రపంచంలో అత్యంత ధనవంతులు, గొప్పవాళ్ళూ' అనగానే అందరి కరతాళధ్వనులతో ఆ సభ హోరెత్తింది. ఆ రోజు అనూష స్కూల్ లో మిగతా అమ్మాయిలు కూడా...'అన్నయ్యా, అనూషలానే మేం కూడా ఏవరైనా ఏడిపిస్తే...అనూష అన్నయ్యకి చెబుతాం అని అనేస్తున్నాం ' అంటూ నవ్వుతూ చెబుతుంటే...నాకు చాలా గొప్పగా అనిపించింది.

ఆ తర్వాత ఒకసారి అమ్మకి ఏదో అనారోగ్య సమస్య వచ్చింది. నేనెందుకో విసిగించానని ...చెయ్యి ఎత్తి నా దగ్గరకు రాబోతుంటే, నేను అందకుండా తప్పించుకోవటానికి పరుగులు పెట్టాను. నా వెనకే హడావుడిగా రాబోయిన అమ్మ హఠాత్తుగా కాలు మెలితిరిగి కాబోలు పడిపోయింది! నాకేం చెయ్యాలో తోచలేదు, ఏడుపునాపుకుంటూనే, పక్కింటికి పరిగెత్తి బామ్మగారిని తీసుకువచ్చాను. నాన్నకు కబురందింది. అమ్మను హాస్పిటల్ కి తీసుకెళ్ళటం జరిగింది.

'డాక్టరు నిన్ను చాలా జాగ్రత్తగా ఉండాలని చెప్పినా ఇంత అజాగ్రత్త ఏమిటీ ?' అంటూ నాన్న కోప్పడ్డారు. అప్పుడే నాకు తెలిసింది, అమ్మకేదో సమస్య వచ్చిందనేది. చిన్నపిల్లలం మాకెందుకూ అని ఆ విషయం చెప్పలేదన్నమాట ! హాస్పిటల్ కెళ్ళాక చాలా హడావుడి జరిగింది. డాక్టరుగారు అమ్మకి వెంటనే ఆపరేషన్ జరగాలన్నారు.

నాన్న మొహంలో ఆందోళనని చూసిందేమో...అమ్మ ' ఈ రాత్రి గడిస్తే ఫరవాలేదని డాక్టరు అన్నారు కదా, నేనూ విన్నాను. పిల్లలిద్దర్నీ మాత్రం ఈ పూట ఇక్కడే పడుకోనివ్వండి ..' అంది ప్రాధేయపడుతున్నట్లుగా.

' చిన్నపిల్లలు...వాళ్ళెందుకూ, నేనుంటాగా...' అన్నారు నాన్న.

' కాదు...ఎందుకో వాళ్ళు నా దగ్గరే వుండాలని గట్టిగా అనిపిస్తోంది ! నాకేం జరిగినా...' అంటూ అమ్మ ఆగిపోయింది, ఆ వాక్యం పూర్తి చెయ్యలేకపోయింది..గొంతు గద్గదికం అవటంవలన.

' నువ్వలా మాట్లాడకు...పిల్లలిద్దరూ చూడు..ఎలా బెంబేలెత్తిపోతున్నారో ' అన్నారు నాన్న అమ్మ చేయి పట్టుకుని పక్కనే కూర్చుంటూ.

' ఏమో నాకలా అనిపిస్తోంది..కాదనవద్దు...ఈ రాత్రికి నా దగ్గరే వుండాలి ' అంది అమ్మ మమ్మల్ని చూస్తూ.

నేను అమ్మకి దగ్గరగా వచ్చి ' నేను ఇక్కడే వుంటానమ్మా. ఇంటికి వెళ్ళమని ఎవరు చెప్పినా వినను ' అన్నాను ఖచ్చితమన్నట్లుగా.

అనూష కూడా వెంటనే నా దగ్గరకు వచ్చి నన్ను పట్టుకుని ' అన్న ఎక్కడ వుంటే...నేనూ అక్కడే ఉంటాను..!' అంది. ఆ మాటలకు నన్ను అతిశయం, ఆనందం నిలువెల్లా ముంచేసాయి ! మురిపెంగా అనూషను దగ్గరకు తీసుకుని ' నా చెల్లెలు ' అనుకున్నాను.

'అవును..మీరిద్దరూ నా దగ్గరే వుండాలి ! మీరిద్దరూ నాకు రెండు కళ్ళు !' అంది అమ్మ. నేను నాన్న వైపు చూస్తూ ' మరి...నాన్న ...? ' అనడిగాను అమ్మని అమాయకంగా. అమ్మ ఒక క్షణం ఆలోచించినట్లుగా ఊపిరి తీసుకుని ' పైకి కనిపించని నా ప్రాణం..!' అంది. నాన్న పెదవులపైకి చిరునవ్వు వచ్చింది.

అమ్మ కాసేపాగి ' మీరు ఇంటికెళ్ళండి...ఫరవాలేదు...డాక్టర్లూ, నర్సులూ ఉంటారుగా...చూస్తార్లే..!' అనగానే నాన్న ' ఇపుడేగా నన్ను నీ ప్రాణం అన్నావ్ ! నీకు దూరంగా నీ ప్రాణం ఎలా వుంటుందీ ? మేం ముగ్గురం ఇక్కడే వుంటాం ఈపూట. చిన్నపిల్లల మీద భారం వేసి నేనింటికి వెళ్ళి నిశ్చింతగా ఎలా ఉండగలననుకుంటున్నావ్ ? నువ్వింకేం మాట్లాడకు..!' అని కొంచెం గట్టిగానే అన్నారు.

రాత్రంతా ఒక పక్క మాతో కబుర్లు చెబుతూనే నాన్న నర్సు కన్నా ముందుగా అమ్మ కి తనే మందు ఇచ్చేవాళ్ళు. అమ్మకి పొద్దున్న అయిదు గంటలకి ఆఖరి డోసు ఇచ్చాకనే నేనూ , నాన్నా నిద్రపోయాం !

బెడ్ మీద ఎవరం పడుకోలేదు...అమ్మ మంచం పక్కనే నేల మీద కూర్చుని మంచం పై తలవాల్చి నేనూ, అనూషా, నాన్న నిద్రపోయామన్నమాట !

బాగా తెల్లారాక పగటి పూట చూసే నర్సు వచ్చి నవ్వుతూ అంది ' నైట్ డ్యూటీ నర్సు చెప్పింది...తనవసరం లేకుండానే మీరు మందు వేసేసేవాళ్ళటకదా...మీది భలే ముచ్చటైన కుటుంబం అండీ..! "

ఆ మాట నాకు నిజమే అనిపించింది.

ఆలూ మగలంటే...మా అమ్మా నాన్నల్లాగే వుండాలి ! నాన్న ఆ రోజు మాత్రమే కాదు, అమ్మ ఇంటికి వచ్చాక కూడా చాలా జాగ్రత్తగా వేళకు మందులు వేసుకుంటుందా, లేదా, తగినంత విశ్రాంతిగా ఉంటోందా, లేదా లాంటి విషయాలన్నీ బాగా గమనించేవారు. ఆ రాత్రి అమ్మ ఆరోగ్యం ఆందోళన కలిగించినా, నాన్నతో కబుర్లు చెబుతూ గడపటం మాత్రం నాకు చాలా ఆనందాన్నిచ్చింది !

నేను కాలేజి నుంచి రాగానే అమ్మని ఎలా వుంది అని అడిగేవాడిని. అనూష ఏమో స్కూల్ నుంచి రాగానే నన్ను 'ఎలా వున్నావ్ అన్నయ్యా' అని అడిగేది. అనూష అభిమానం, ఆరాధన నాకు ఆ రోజుల్లో ఎంతో గొప్పగా గర్వంగా వుండేది. స్కూల్ సంగతులూ, స్నేహితుల కబుర్లు చెబుతూ నిద్రపోయేదాకా గలగలా మాట్లాడుతూనే ఉండేది.

అలా అనూష పెళ్ళి అయ్యేంతవరకూ మా ఇంట్లో సందడంతా తనే. తర్వాత అనూష పెళ్ళి, నాన్న మరణం...అమ్మనూ నన్నూ మరింత దగ్గర చేసాయి...." అంటూ గొంతు బొంగురుపోవడంతో ఆ జ్ఞాపకాలతో వంశీ మౌనంగా ఉండిపోయాడు.

సుమజ ఉద్విగ్నంగా..." నిజంగా మీ అన్నా చెళ్ళెళ్ళ అనుబంధం చాలా గొప్పగా వుంది. అంతలా ఆరాధించే చెల్లెలు ఉండటం నిజంగా మీ అదృష్టం ' అనిపిస్తుంది " సుమ మనస్ఫూర్తిగా అంది.

అలా అంతలా అభిమానించే చెల్లెలు..ఇప్పుడు కొత్తగా 'అమ్మ తనకే కన్న తల్లి' అనీ...అన్నయ్య ని పరాయి చేస్తూ మాట్లాడుతుంటే తను తట్టుకోలేకపోతున్నాడు... ' ఎందుకు అనూషా, ఇంత భేదం వచ్చిందీ...ఏం చేస్తే మళ్ళీ నీ నమ్మకం పొందగలుగుతానూ...నీ కన్నా నాకు స్థలం కానీ , ఇంకే ఆస్థి కానీ ముఖ్యం కాదు అని ఎలా చెప్పనూ'....అని మనసులోనే మౌనంగా రోదిస్తూ వంశీ అలా వుండిపోయాడు.

వెంటనే సుమజ టాపిక్ మారుస్తూ…" బాధ పడకండి, వంశీ…డాక్టరుగారు ఆవిడ మనసుకు ఏదో గాయం కలిగిందనీ, అందువలనే అలా జరిగి ఉండొచ్చని అన్నారుకదా… అదేమిటో తెలుసుకుని ఆవిధంగా ప్రయత్నిస్తే బావుటుందేమో…!''

వంశీ నుండి ఏ మాటలూ వినిపించకపోయేసరికి ''ఏంటీ… ఏం మాట్లాడటం లేదూ…?'' అంటూ సుమజ రెట్టించింది.

''ఏదో ఆలోచనలో పడి..'' అంటూ సంజాయిషీ ఇచ్చిన వంశీ ''ఇంకో ప్రయత్నం చేద్దామనుకుంటున్నాలే…'' అంటూ ఫోను ఆపేసేసరికి సుమజ కొంచెం ఆశ్చర్యపోయింది! 'ఏమిటో… ఇతని ప్రవర్తన ఎప్పుడూ లేని విధంగా కొత్తగా ఉందే' అనుకుంటూ నిట్టూర్చింది.

***

ఆ మరునాడు… శ్యామసుందరి గదిలో ఏదో సర్దుతున్న వంశీని చూసి తిలోత్తమ ''ఈ గదిలో ఏం చేస్తున్నావు బావా… నేను అన్నీ సర్దుకున్నాను… బయలుదేరటానికి. ఆ మాట చెబుదామని వచ్చాను…'' అంది.

''ఏం లేదులే… అమ్మని ఆరోజు హఠాత్తుగా డాక్టరు గారింటికి మార్చటం వలన ఈ గదిలోని వస్తువులన్నీ కొంచెం చిందరవందరగా ఉంటేనూ, సర్దుతున్నా. పార్వతి గది శుభ్రం చేస్తున్నాగానీ… వీటన్నిటినీ పట్టించుకోదుగా… అందుకూ…!'' అంటూనే వంశీ తిలోత్తమ చేయి పట్టుకుని ''ఏమిటి తిలోత్తమా… ఈ పరిస్థితుల్లో నన్ను ఒంటరిగా వదిలేసి వెళ్లిపోదామనే ఆలోచన చేస్తున్నావా? అసలు నువ్వు ఏ ఉద్దేశ్యంతో వచ్చావూ? అది నెరవేకుండానే ప్రయాణం తలపెట్టావేమిటీ?'' అనడిగేసరికి తిలోత్తమ బిత్తరపోయింది!

అతనివైపు ఆశ్చర్యంగా, విచిత్రంగా, అనందంగానూ చూసింది.